




స్థాపితం : 1930 LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

# జమీన్ రైతు

సంపుటి : 78 సంచిక 50 14-12-2007 శుక్రవారం 16 పేజీలు విడి ప్రతి : రూ. 5/-







# ప్రభుత్వ భూమంటే ఆయన అబ్బ సొత్తా?

## ముఖ్యమంత్రి కార్యదర్శి, బిజెపినేత వెంకయ్యనాయుడు, జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తలా కొంచెం సర్కారు భూములు స్వంతం చేసుకొన్నారు. బయటపడని పేర్లు ఇంకెన్ని వున్నాయో వైఎస్‌కే ఎరుక?

ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి భూదోపిడీ యజ్ఞం నెల్లూరు జిల్లాకు కూడా విస్తరించింది. ప్రభుత్వ భూములను పటిక బెల్లం వలె పంచిపెట్టడం ఆయనకొక వినోదమన్న సంగతి తెలిసిందే. హైదరాబాదు నగరంలో అంగుళం సర్కారు నేల మిగలకుండా తమ వారికి దోచి పెట్టేశారు. విశాఖపట్నం నగరం చుట్టు ప్రక్కల అందమైన కొండలన్నిటినీ ఆరగించివేశారు. విజయవాడ నగరంలో కాగడావేసి వెతికినా ప్రభుత్వ భూమి అన్నది మిగలకుండా దిగమ్రింగేశారు. అయినా దాహం తీరక, ఇప్పుడు జిల్లాలకూ తమ దోపిడీ కృత్యాలను విస్తరింప చేస్తున్నారు. ప్రభుత్వ భూమి అంటే తన అబ్బసొత్తు అనుకొన్నట్లుంది ముఖ్యమంత్రి. అడగని వాడిది పాపం. దానకర్ణుడి మునిమనుమడి వలె పట్టాలు వ్రాసి ఇచ్చేస్తున్నారాయన. ప్రభుత్వం అంటే తన జాగీరైనట్లు జమీందార్లు మాన్యాలు వ్రాసి ఇచ్చినట్లు తనకు నచ్చిన వారికి ఎంత భూమి అయిన ఇచ్చే అధికారం తనకున్నట్లు, తానేమి చేసినా ఎవరూ అడగడానికి లేదన్నట్లు వుంది ముఖ్యమంత్రి ధోరణి. ఆయన అండ చూసుకొని ఆయన అంతేవాసులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, చివరకు ఆయన పేషీ అధికారులు కూడా బరితెగించి పోతున్నారు. ప్రజల ఆస్తులను గాలికి పోయే పేలపిండి వలె ఆరగించి వేస్తున్నారు.

ముఖ్యమంత్రి పేషీలో ఒక కార్యదర్శి పి.సుబ్రమణ్యం. ఆయనది నెల్లూరు జిల్లా గుడిపల్లిపాడు గ్రామం. కలెక్టర్ స్థాయి వరకు ఆయనకు నిజాయితీపరుడని పేరు వుండేది. సమర్థుడైన అధికారి అన్న గుర్తింపు వుండేది. ముఖ్యమంత్రి పేషీలో నిత్యం జరిగే తప్పుడు పనులు, నిలువు దోపిడీ కార్యాలు చూసి చూసి, సహవాస దోషం తగిలినట్లుంది ఆయనకు కూడా. వెంకటాచలం దగ్గర, క్యాబా ఇంజనీరింగ్ కాలేజి ఎదురుగా, జాతీయ రహదారిని ఆనుకొని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమి తన భార్య మార్గరేట్ విజయకుమారి పేరిట పట్టా తీసుకొన్నాడు. ఎకరా కోటి రూపాయలకు పైగా విలువ చేసి ఖరీదైన భూమి ఇది. ఏదో ఒక సాకు చూపించాలి కాబట్టి, తన కుమార్తె అలెక్స్ పేరిట బియిడి కాలేజి పెట్టబోతున్నట్లు రికార్డుల్లో వ్రాశారు. నెల్లూరు జిల్లాలో చాలా బియిడి కాలేజీలున్నాయి. ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు కూడా వున్నాయి. కాని వాటి వేటికీ ప్రభుత్వం ఒక్క అంగుళం స్థలం కూడా ఇవ్వలేదు. ఇవ్వవలసిన అవసరం కూడా లేదు. విద్యా సంస్థలు ఈ దినాలలో సేవా దృక్పథంతో నడవడం లేదు. పక్కా వ్యాపారంగా నిర్వహిస్తున్నాయి. లక్షల్లో ఫీజులు దండి, కోట్లలో లాభాలు ఆర్జిస్తున్నాయి. అటువంటి సంస్థలకు ప్రభుత్వం భూములను నామ మాత్రం ధరలకు ఇవ్వవలసిన అగత్యం ఏమిటి? అసలు కాలేజీ పెట్టే ఉద్దేశ్యం కూడా లేని వారికి ఆ పేరుతో ప్రజల ఆస్తి దోచ్చి పెట్టడమేమిటి? రాజకీయవాదులు తప్పు చేస్తే అడ్డు చెప్పి సరిదిద్దవలసిన, ప్రజలకు జవాబుదారిగా వుండవలసిన ఐఏఎస్ అధికారులు ఆ నీచపు కక్కుర్తికి పాల్పడడం ఏమిటి? ఐదు కోట్ల రూపాయల ఆస్తి దక్కిందని సుబ్రమణ్యం ఆనందపడుతున్నాడెమో తెలియదు; కాని, అంతకు ఎన్నో రెట్లు ఒక అధికా


తొరవ 14వ పేజీలో




రిలయన్స్ 'ఎ-1' ప్లాజా ఎదురుగా వెంకయ్యకు కేటాయించిన ప్రభుత్వ స్థలం


స్థాపితం: 1949 ఫోన్: 2329622

కళ్యాణ శుభకార్యములకు విచ్చేయండి!

కంచి, ధర్మవరం, వెంకటగిరి మరియు ఫ్యాన్సీ చీరలు సరసమైన ధరలకు...

మోహిని స్టోర్స్

ట్రంక్‌రోడ్డు - నెల్లూరు.


లోపలి పేజీల్లో...


- లక్షల్లో గాజులమ్మకం.
- జైలులో వివేకా హవా...
- సిపిఎంలో స్వాహారాయుళ్లు.
- చిరంజీవి ముక్కంటి
- మానసిక రోగుల మాయం
- గందరగోళంగా గొడవ



భారతదేశంలోకెల్లా అతి తక్కువ ధర గ్యారంటీ!

100% సర్టిఫైడ్ 916KDM హాల్‌మార్క్ ఆభరణములు

డైమండ్స్ & డిజైనర్

జ్యూయలరి ఎగ్జిబిషన్ - 2007

డిసెంబర్ 17 నుండి 21 వరకు

26 వ వార్షికోత్సవం

➤ గొప్ప ఆఫర్

7 వజ్రాలు పొదిగిన ఒక జత (0.80 క్యారట్లు) కమ్మలు కేవలం రూ. 29,000/- మాత్రమే

మీ న్యూ ఆంధ్రా జ్యూయలరిలో 17 డిసెంబర్ - 2007 న ప్రవేశపెడుతున్నాము

నాజ్ డైమండ్స్ & డిజైనర్ కలెక్షన్ - 2008.



Designed & Concept by

Anita Jain Naj Director & Gemologist

- Naj Diamonds Certified by IGI Belgium
- Only Shop in Nellore gives the Certified Diamonds of IGI Belgium

నాజ్ డైమండ్స్ 5CS అంటే కట్, కలర్, క్లారిటి, క్యారెట్, క్రెడిబులిటి కలిగినటువంటి IGI BELGIUM గ్యారంటీ కార్డుతో అందివ్వబడుతుంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన డిబియర్స్ (DTC SightHolders) నుంచి నేరుగా దిగుమతి చేసుకోబడిన అంతర్జాతీయ స్థాయి నాణ్యత కలిగినటువంటి వజ్రాలు ఇండియన్ డైమండ్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లమా పొందిన న్యూ ఆంధ్రా జ్యూయలరి డైరెక్టర్ అనితా జైన్ చే పరీక్షించబడి ఆ తరువాతనే ఆభరణములో పొదగబడుతుంది.

నాజ్ డైమండ్స్ 100% దోషము లేని వజ్రాలని నిరూపించబడినవి.

naj Diamonds

Naj Diamonds Certified by IGI Belgium

న్యూ ఆంధ్రా జ్యూయలరి®

www.najjewellery.com

నాజ్ డైమండ్స్ & డిజైనర్ కలెక్షన్ మీ న్యూ ఆంధ్రా జ్యూయలరి లో మాత్రమే లభ్యం!

# అటవీ ఫలం అధికారుల జేబుల్లోకే!

అటవీ సంపదను పరిరక్షించాల్సిన అటవీశాఖ అధికారులే దాన్ని భక్షిస్తున్నారు. నర్సరీల ఏర్పాటు, బంజరు భూముల్లో చెట్లను పెంచడం, రోడ్డు ప్రక్కన, చెరువు గట్లపై మొక్కలను నాటి పెంచే కార్యక్రమం అటవీశాఖ చేపడుతుంటుంది. జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో సామాజిక అటవీశాఖ, అటవీ అభివృద్ధి సంస్థలు పనిచేస్తున్నాయి.

వీటిలో నర్సరీల ఏర్పాటు, రోడ్డు ప్రక్కల, చెరువు గట్లు బంజరు భూములలో మొక్కలు నాటి పెంచే కార్యక్రమాన్ని సామాజిక అటవీశాఖ చేపడుతుంది. ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అటవీశాఖకు సంబంధించిన భూములలోనే మొక్కలు నాటి పెంచే కార్యక్రమం చేస్తున్నది.

అటవీ భూములను చదును చేసే దగ్గర నుంచి అవి పెరిగి పెద్దవి అయిన తర్వాత కాపుకు వచ్చేవరకు అన్ని బాధ్యతలు అధికారులే చూస్తుంటారు. దీనికి అవసరమైన నిధులను కూడా ఖర్చుచేసే అధికారం ప్రభుత్వం అప్పగించడంతో అధికారులకు చేతినిండా కాసులే. నిధుల ఖర్చులకు సంబంధించి పర్యవేక్షణ లేకపోవడంతో పై స్థాయి అధికారి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు ఇష్టానుసారంగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు.

సామాజిక అటవీ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని 46 మండలాల్లో మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతున్నది. 2006-07 సంవత్సరంలో తీర ప్రాంతంలో 61 హెక్టార్లు; చెరువు గట్లకు సంబంధించి 174 హెక్టార్లు; పోరంబోకు భూములలో 116 హెక్టార్లు; నర్సరీలలో 20 లక్షల మొక్కలు పెంచడం వంటి కార్యక్రమాలు చేపట్టారు.

2007-08 సంవత్సరానికి సంబంధించి తీర ప్రాంతం వెంబడి 400 హెక్టార్లలో; చెరువుగట్లకు సంబంధించి 50 హెక్టార్లలో; పోరంబోకు భూములలో 75 హెక్టార్లు; రహదారుల ప్రక్కన 30 కి.మీ దూరం మొక్కలు నాటడం; నర్సరీలలో కోటికిపైగా మొక్కలు పెంచాలని అటవీశాఖ అధికారులు నిర్ణయించారు.

ఇందుకు గాను గత ఏడాది కోటి 83లక్షల 10వేల రూపాయలు ఖర్చుచేయగా ఈ సంవత్సరం 4కోట్ల 52లక్షల 19వేల రూపాయలను ఖర్చు చేయాలన్న లక్ష్యంతో ప్రణాళికను రూపొందించారు.

ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గత సంవత్సరం 200 హెక్టార్లలో చెట్లు నాటారు. ఈ సంవత్సరం 300 హెక్టార్లలో చెట్లు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీని కోసం దరిదాపులు రెండు కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నారు. ఈ విభాగం ఆధ్వర్యంలో ఒక రీజనల్ మేనేజర్ ముగ్గురు డివిజనల్ మేనేజర్లు పర్యవేక్షణ చేస్తుంటారు. ఈ విభాగం ఆధ్వర్యంలో నాటిన చెట్లు ఏడు సంవత్సరాలకు ఎత్తుగా పెరుగుతాయి. అనంతరం వీటిని కటింగ్ చేసి విక్రయిస్తుంటారు.

ప్రభుత్వం కల్పించిన అధికారాన్ని అడ్డం పెట్టుకొని కొందరు అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ అనతికాలంలోనే లక్షాధికారులు అవుతున్నారు. భూమిని చదును చేయడం, భూమిని దుక్కి చేయించడం, మొక్కలు కొనుగోలు చేయడం, కూలీలచేత వాటిని నాటించడం, కొద్ది కాలం వరకు మొక్కలకు నీటిని పోయించడం వంటి పనులు అధికారులు చేయిస్తుంటారు. ఈ పనులు చేయించడం కోసం వినియోగించే ట్రాక్టర్లకు, కూలీలకు తక్కువ నగదు చెల్లించి ఎక్కువ చెల్లించినట్లుగా బిల్లులు డ్రాచేసి సంబంధిత అధికారులు స్వాహా చేస్తుంటారు.

నర్సరీలలో పెంచిన మొక్కలను రైతులకు, ఎస్సీ, ఎస్టీలకు విక్రయిస్తుంటారు. అటవీశాఖ నిర్ణయించిన ధరలకు మొక్కలను విక్రయించాల్సివున్నా అందుకు భిన్నంగా నర్సరీ అధికారులు అధిక ధరలకు విక్రయిస్తుంటారు. ఎస్సీ, ఎస్టీలకు 50శాతం రాయితీతో నర్సరీల మొక్కలను విక్రయించాలి. అయితే అధికారులు ఎస్సీ, ఎస్టీలకు కూడా ఇతరులకు విక్రయించిన విధంగానే విక్రయిస్తూ, రికార్డులలో మాత్రం సబ్సిడీ కింద విక్రయించినట్లు నమోదు చేస్తారు.

సబ్సిడీ క్రింద విక్రయించిన మొక్కలకు వసూలు చేసిన నగదును మాత్రం అటవీశాఖ ఖజానాకు జమ చేసి మిగిలిన మొత్తాన్ని సంబంధిత అధికారులు వాటాలుగా పంచుకుంటున్నారు. కొన్ని నర్సరీలలో లక్ష్యానికి మించి మొక్కలను పెంచుతున్నారు. లక్ష్యానికి మించి ఎక్కువగా పెంచిన మొక్కలను లెక్కల్లో చూపకుండా విక్రయిస్తుంటారు. నర్సరీలలో పనిచేస్తున్న కూలీలకు కనీస వేతనాలు చెల్లించడం లేదన్న అపవాదు అధికారులపై వుంది. పురుషులకు 100 రూపాయలు మహిళలకు 80 రూపాయలు దినసరి కూలి చెల్లించాలి. అధికారులు మాత్రం పురుషులకు 70 రూపాయలు, మహిళలకు 50 రూపాయలు దినసరి వేతనంగా చెల్లిస్తుంటారు.

లెక్కలలో మాత్రం పురుషులకు 120 రూపాయలు, మహిళలకు 80 రూపాయలు వేతనంగా చెల్లించినట్లు నమోదు చేస్తారు. నర్సరీలు ఏర్పాటు, బంజరు భూములలో మొక్కలను పెంచే పనులు చేయించడంలో అటవీశాఖ అధికారులకు పూర్తి అధికారం కల్పించింది.

ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టే ఈ పనులకు ప్రతి సంవత్సరం అటవీశాఖ కోట్ల రూపాయలు కేటాయించి ఖర్చు చేస్తున్నది. ప్రభుత్వ పథకాలు నీరు గార్చడం, అవినీతి, అక్రమాలకు పాల్పడి జేబులు నింపుకోవడం మన అధికారులకు వెన్నతో పెట్టిన విద్య. సాధించాల్సిన లక్ష్యం ముందు కెళ్లాల్సిన పథకాలు మంచి సంకల్పంతో అనతి కాలంలోనే నిర్వీర్యం కావడానికి అధికారులే కారణమని చెప్పవచ్చు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులకు రాజకీయ పార్టీల నాయకులు, కీలకస్థానాల్లో వున్న అధికారుల అండదండలు పుష్కలంగా వుండడంతో వీరి ఆగడాలకు అంతు లేకుండా పోతున్నది.

అటవీశాఖలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అవినీతి, అక్రమాల గురించి ప్రభుత్వం దృష్టి సారించి విజిలెన్స్ అధికారుల చేత విచారణ జరిపిస్తే కోట్ల రూపాయల దుర్వినియోగం బయటపడే అవకాశం వున్నది. కోట్లరూపాయల వ్యయంతో నర్సరీలు, చెట్ల పెంపకం కార్యక్రమాలు చేపడుతున్నా వాటి ఫలాలు, ఆదా యాలు ప్రజలకు గానీ, ప్రభుత్వానికి గానీ చెందడం లేదు.

వీటి ఫలాలు కేవలం అటవీశాఖ అధికారుల జేబులు నింపేందుకు సరిపోతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ అటవీశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించి అవినీతి, అక్రమార్కుల భరతం పట్టాల్సిన అవసరం వుంది.


లక్షలు ఖర్చుపెట్టి వనాలను అభివృద్ధి చేసేదిట్లేనా?

**అటవీ శాఖలో నిధుల ఖర్చుకు పైస్థాయి అధికారి నుంచి క్రింది స్థాయి సిబ్బంది వరకు ఇష్టానుసారంగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు.**


నెల్లూరులోని సామాజిక అటవీశాఖాధికారి కార్యాలయం.

16-12-2007 ప్రథమ వార్షికోత్సవం
డా॥ విక్రమ్స్ దంతవైద్యశాల
Dr. Vikram's Speciality Dental Health Centre
Dr. Vikram's
SPECIALITY DENTAL HEALTH CENTRE

డా॥ విక్రమ్ వాసంరెడ్డి
డెంటల్ & కాస్మొటిక్ సర్జన్
11-44, హనుమాన్‌వీధి, ఆంధ్రబ్యాంకు ఎదురు, సూళ్ళూరుపేట, నెల్లూరు జిల్లా.
ఫోన్ : 08623 - 244399, సెల్ : 9866505152
అత్యంత ఆధునిక వైద్య పరికరాలతో ప్రారంభించి సూళ్ళూరుపేట ప్రజలకు విశేష వైద్యసేవలందిస్తున్న డా॥ విక్రమ్స్ దంతవైద్యశాల ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
డా॥ వి. విజయ శంకర్ యాదవ్ MDS
నెల్లూరు.
డా॥ ఆలూరు స్వరూప్‌కుమార్‌రెడ్డి MDS
నెల్లూరు.

## శంకుస్థాపనలతో సరి...

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ నియోజక వర్గంలో మరీ ముఖ్యంగా వెంకటగిరి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్ర మాలకు శంకుస్థాపనలు చేస్తున్నా అధి కారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా రవ్వంత పనికూడా జరగడం లేదు. బాలికల సౌలభ్యం కోసం ముప్పై

### వెంకటగిరిలో అభివృద్ధి పనులకు గ్రహణం!

లక్షల రూపాయలతో సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని నిర్మించేందుకు 2006 జనవరిలో శంఖుస్థాపన చేశారు. మున్సిపల్ భవనం నిర్మించేందుకు కూడా కాలేజి ఆవరణలో శంఖుస్థాపన చేశారు. శంఖుస్థాపనైతే చేశారుగానీ ఇంతవరకు ఒక్క ఇటుక కూడా అటు తీసి ఇటు పెట్టలేదు. రెండు సంవత్స రాలు కావస్తున్నా భవన నిర్మాణ పనులు చేపట్టక పోవడం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తున్నది. అప్పటికీ, ఇప్పటికీ

తొరవ 14వ పేజీలో



నెల్లూరీయుడు, ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడ్డ రామిరెడ్డి దశరథరామిరెడ్డి కుమార్తె స్వర్ణ, వింజమూరు జడ్పీటిసి నారపరెడ్డి కుమారుడు భరత్‌ల వివాహం నవంబర్ 30తేది నెల్లూరు సిపిఆర్ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది.

## దెబ్బతినిపోయిన వంతెనలు!

వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో తెలుగుగంగ కాలువపై నిర్మించి వున్న పలు వంతెనలు శిథిలావస్థకు చేరు కొన్నాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ వంతెనలపైనే రాకపోకలు సాగిస్తూ వుంటారు. పలభైకు పైగా వంతెనలు తెలుగుగంగ కాల్వపై నిర్మించి వున్నాయి. వాటిలో ఎక్కువ

### వెంకటగిరిలో ఎప్పుడేం జరుగుతుందో?

భాగం శిథిలావస్థకు చేరుకొని ఎప్పుడు కూలిపోతాయో చెప్పలేని స్థితిలో వున్నాయి. పలు గ్రామాల మధ్య సం బంధాలు వీటితోనే ఇమిడి వుండడం ఈ వంతెనలు పూర్తిగా దెబ్బతినడంతో వుండడంతో వీటిపై ప్రయాణించాలం టేనే ప్రయాణీకులు హడలిపోతున్నారు. కొన్నిచోట్ల వంతెనలకు ఇరువైపులా వుండే రక్షణ గోడలు పడిపోయి వున్నాయి. నిర్మించిన నాటి నుంచి వాటి గురించి పట్టించుకొన్న దాఖలాలు

తొరవ 14వ పేజీలో

# కమ్యూనిస్టుల్లోనూ స్వాహారాయుళ్లు!

రాజకీయాల్లో వున్న వారు ఒక రిపై ఒకరు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకోవడం, అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలు ఒకరినొకరు విమర్శించుకో వడం సహజం. అయితే కమ్యూనిస్టు పార్టీ సర్పంచ్ చేసిన తప్పును అదే పార్టీకి చెందిన ఉప సర్పంచ్ బట్ట బయలు చేసిన ఉదంతం బుచ్చిరెడ్డి పాళెం మండలం పెనుబల్లి గ్రామంలో జరిగింది. ఈ గ్రామానికి రెండు నెలల కిందట కేంద్ర ప్రభుత్వం పారిశుధ్యం మెరుగు పర్చడం కోసం విడుదల చేసిన నిధులను సిపిఎం పార్టీకి చెం దిన సర్పంచ్, ఎంపిటిసి, ఆరోగ్య కార్య

### సర్పంచ్ అవినీతిని బయట పెట్టిన ఉపసర్పంచ్

కర్త కలసి దిగమింగారు. పారిశుధ్య మెరుగుదలకు ఖర్చు పెట్టాల్సిన నిధులు సర్పంచ్ స్వాహా చేయడంతో, అదే పార్టీకి చెందిన ఉప సర్పంచ్ జార్జి దీనిని బట్టలు బయలు చేశాడు. దీనిపై వివ రణ ఇవ్వమని జార్జి కోరినా సర్పంచ్, ఎంపిటిసిలు సమాధానం చెప్పకపోవ డంతో ఉపసర్పంచ్ జార్జి అరగుండు గీయించుకొని వినూత్నంగా నిరసన తెలపడంతో కామ్రేడ్లు ఉలిక్కిపడ్డారు. ఈ కుంభకోణంపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవ డంతో బహిర్గతం చేయాల్సి వచ్చిందని జార్జి చెబుతున్నాడు. తాము సచ్ఛీలుర మని, పేద ప్రజల పక్షాన నిలబడు తున్నామని చెప్పుకొనే కమ్యూనిస్టులు ఈ కుంభకోణంలో తమవారి ప్రమే యంపై ఏం సమాధానం చెప్తారో?



ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ నేతృత్వంలో జరిగిన సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న ఆర్య వైశ్యులు.



నెల్లూరు ఇందిరాభవన్‌లో లేపాక్షి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, అక్కడి వస్తువులు పరిశీలిస్తున్న మేయర్ పులిమి శైలజ. ప్రక్కన లేపాక్షి మేనేజర్ జగన్మోహన్, మాజీ కౌన్సిలర్ బాలసుధాకర్, యేసు నాయుడు.

## ఆత్మకూరులో దురాక్రమణలు

నియోజకవర్గ కేంద్రమైన ఆత్మ కూరు పట్టణానికి ఆక్రమణల చెరప ట్టింది. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెంది రోడ్లు విశాలంగా వుంటుండగా ఆత్మ కూరులో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా వుంది. పట్టణంలోని ముఖ్య కూడలిలో రెండు బస్సులు తిరగాలం టేనే కష్టతరంగా వుంటున్నది. రోజు రోజుకు పట్టణం ఆక్రమణల కారణంగా కుంచించుకు పోతుండడంతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతున్నది. ట్రాఫిక్

### 80 అడుగుల రోడ్డు 30 అడుగులయ్యింది

క్రమబద్ధీకరణకు పలువురు కానిస్టేబుళ్ల విధులు నిర్వహిస్తున్నా ఏమాత్రం ట్రాఫిక్ క్లియర్ కావడం లేదు. సోమ శిల రోడ్డు సెంటర్ నుండి పంచాయితీ బస్టాండు వరకు వున్న రోడ్డుకు ఇరు వైపులా ముప్పై అడుగుల వరకు ఆక్ర మించి వ్యాపారులు అంగళ్లు ఏర్పాటు చేసుకొని వుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నది. గతంలో 80 అడుగుల వరకు రోడ్డు కోసం వదిలిపెడితే నేడు 30 అడుగులకు కుంచించుకొని పోయిం దంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

తొరవ 14వ పేజీలో

## బుచ్చి మండల సమావేశం గరంగరం

ఎప్పుడూ సాదాసీదాగా జరిగే బుచ్చి మండల సమావేశం ఈసారి వాడి వేడిగా జరిగింది. ఒక దశలో సభ్యుల అరుపులు, కేకలతో సమావేశ మందిరం దద్దరిల్లిపోయింది. సమావేశం ప్రారం భంకాగానే దామరమడుగు సర్పంచ్ మాట్లాడుతూ వరదల కారణంగా దెబ్బ తిన్న రైతులను ఆదుకొనేందుకు సహాయ కార్యక్రమాలు వేగవంతం చేయాల న్నారు. వర్షాకాలంలో రిజర్వాయర్‌లో 18 అడుగుల కన్నా మించి 21 అడు గుల నీరు ఎందుకు నిల్వ చేయాల్సి వచ్చిందని అధికారులను నిలదీశారు. దీనికి కారణమైన వారిని ప్రాసిక్యూట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇరిగేషన్

### వరద సాయం అజెండాగా...

అధికారి కొండయ్య దీనికి కోర్టు అను మతి వుందని సమాధానం ఇవ్వడంతో ఒక్కసారిగా సమావేశం వేడెక్కింది. ఎంపిటిసిలు భాస్కర్‌రావు, షాహుల్ కోర్టు ఉత్తర్వు ముఖ్యమా, ప్రజల ప్రాణాలు ముఖ్యమా అని ఆగ్రహంగా ప్రశ్నించారు. కనీసం నీరు నిల్వ చేసే ముందు లోతట్టు ప్రాంతాల ప్రజలను

తొరవ 14వ పేజీలో



గీతాంజలి చిత్ర నిర్మాత చిట్టమూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కుమార్తె శ్రీమనస్విని, గౌతమ్‌రెడ్డిల వివాహ రిసెప్షన్‌లో నూతన వధూవరులతో డా॥ అక్కినేని నాగేశ్వరరావు.

# చిరంజీవి ముక్కంటి!

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో నటుడు చిరంజీవి ముక్కంటి అని బిజెపి జాతీయనేత వెంకయ్య నాయుడు అభివర్ణించారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో 9వ తేదీ విలేకరులతో మాట్లాడారు. తెలుగు



కళామతల్లికి ఎన్టీఆర్, ఎఎన్ఆర్ రెండు కళ్లయితే చిరంజీవి ముక్కంటి. ఆయన మంచి నటుడు. కోట్లాది మంది అభిమానులను సంపాదించుకొన్నాడు. రాజకీయాలలోకి వచ్చేది, లేనిది ఆయన ఇష్టం. ఇప్పటి వరకు ఆయన రాజకీయ రంగ ప్రవేశం గూర్చి నోరు విప్పి మాట్లాడలేదు. రాష్ట్రంలో ఉచిత విద్యుత్ రైతులకు అందుతుందో లేదో తెలియదు కానీ పత్రికలు, టీవీల పుణ్యాన ప్రజలకు చిరంజీవి రాజకీయ ప్రవేశం ఉచిత కాలక్షేపంగా వుంటున్నదని చమత్కరించారు. చిరంజీవినే కాదు; ఎవరైనా రాజకీయాలలోకి రావచ్చు. అయితే స్పష్టమైన అజెండా వుండాలి. ఇప్పుడున్న పార్టీల అజెండా కంటే కొంత భిన్నమైన ప్రత్యామ్నాయ అజెండాతో ముందుకు వస్తే ఆయనకు బలముంటుందన్నారు. కుల రాజకీయాలు ఎల్లకాలం విజయవంతం కావు. సర్వజనం అంటే అన్ని కులాలు వుండాలి. కుల ప్రాతిపదికన రాజకీయాలు కొద్దికాలం మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడి

తరువ 14వ పేజీలో



లేఔట్‌లో రిజర్వు స్థలం.

# రిజర్వు స్థలాలు అమ్మేస్తున్నారు.

నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని లేఅవుట్‌లలో ప్రజా వసతుల నిమిత్తం వదలిన రిజర్వు భూములను అధికార పార్టీ నాయకులు ఒక రింగ్‌గా ఏర్పడి ఆక్రమించుకొని ఆ పై అమ్ముకొంటున్నారు. నెల్లూరులో గత పదేళ్లుగా పలు లే అవుట్లు వెలిశాయి. వీటిలో స్థలాలన్నీ అమ్ముడుపోయాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు సిటీ ప్లానింగ్ చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా గుడి, బడి, పార్కు గ్రంథాలయం, బస్టాపుల కోసం రిజర్వు భూములను వదలి పెట్టారు. ఒక వెంచర్ నుంచి ఇంకో వెంచర్‌కు స్థలాల వాస్తవ రిజిస్ట్రేషన్‌దారులు వెళ్లి పోతుండడంతో రిజర్వు స్థలాల గూర్చి ఈ స్థలాల్లో ఇళ్లు కట్టుకొన్న వాళ్లకు తెలియదు. ఈ మధ్య అధికార పార్టీకి చెందిన చోటా మోటా నాయకులు ఇటువంటి రిజర్వు స్థలాలను గుర్తించి ఆక్రమిస్తున్నారు. స్థలం చుట్టూ గోడలు, ఫెన్సింగ్ వంటివి వేస్తున్నారు. పాత స్థల యజమానులు తమకు రిజిస్ట్రేషన్ చేసి

తరువ 14వ పేజీలో

# కొలువుండే చోట కాపురాలు పెట్టలేదు!

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తుంటారు. అన్ని సమయాల్లో పోలీసులు అందుబాటులో వుండేందుకు ఆయా స్టేషన్ల పరిధిలో పనిచేసే సిబ్బందికి అక్కడే క్వార్టర్లు, అవి లేనిచోట హౌస్‌రెంట్ అలవెన్సును ప్రభుత్వం ఇస్తుంది. కానీ జిల్లా వ్యాప్తంగా పనిచేసే పోలీసులు, ఎస్ఐ, సిఐలు తాము పనిచేసే చోట నివాసముండడం లేదు. 24గంటలు అప్రమత్తంగా వుంటేనే నేరాలను అదుపు చేయడం కష్టంగా వున్న తరుణంలో జిల్లాలోని మెజార్టీ మండల పోలీస్ స్టేషన్లలో పనిచేసే ఎస్ఐలు పనిచేసే చోట కాపురం వుండక, నెల్లూరులో వుంటున్నారు. దీని వల్ల పెద్దనేరాలు, ప్రమాదాలు జరిగినప్పుడు స్టేషన్ హౌస్‌ఆఫీసర్ అందుబాటులో లేక పోవడం పలు సమస్యలు సృష్టిస్తుంది. నెల్లూరులోనే ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు, సమీప ప్రాంతాల్లోని స్టేషన్లకు బదలీ అవుతూ పలువురు ఎస్ఐలు నెల్లూరు నగర వాతావరణానికి అలవాటు పడిపోయారు. పిల్లల చదువులు, రకరకాల వ్యాపారాలలో మునిగి తేలుతూ వారంలో రెండు, మూడు రోజులు నెల్లూరులోనే వుంటున్నారు. ఆదివారం పూట అయితే మండల కేంద్రాల్లోని స్టేషన్‌లలో ఎస్ఐలే

వేళల్లో ఎస్ఐలు వుండకపోవడమే కారణంగా తేలింది. సెంట్రీలు, క్రింది స్థాయి పోలీసులు కలదిలుసుకునే లోపలే నేరస్తులు తప్పించుకొంటు



నెల్లూరులోని ఈ క్వార్టర్స్ అంటే ఎంత ప్రేమో!

కనపడడం లేదు. గూడూరు డివిజన్‌లో రాత్రి పూట జరిగిన సీరియల్ హత్యలకు కారకులను మన జిల్లా పోలీసులు పట్టుకోలేక పోవడానికి స్టేషన్లలో రాత్రి న్నారు. నెల్లూరు పోలీస్ క్వార్టర్లలో తిష్ట వేసి వున్న ఎస్ఐలను పనిచేసే ప్రాంతాలకు కాపురం వెళ్లేలా ఎస్పీ చర్యలు తీసుకోవాల్సి వుంది.

# అశ్లీల పోస్టర్లతో ఇబ్బందులు!

నెల్లూరు నగరంలో అడుగడుగునా దర్శనమిస్తున్న అశ్లీల పోస్టర్లు యువతను పెడత్రోవ పట్టిస్తున్నాయి. వీటికి వ్యతిరేకంగా విద్యార్థి మహిళా సంఘాలు ఆందోళన చేస్తున్నప్పటికీ పోలీసుశాఖ వీటిని నివారించలేక పోతుంది. ఉద్యమాలు జరిపి కాస్త అలజడి జరిపినప్పుడు మాయమయ్యే అశ్లీల పోస్టర్లు మళ్లీ జనం రద్దీ ఎక్కువగా వుండే ప్రాంతాల్లో దర్శనమిస్తున్నాయి. నగరంలోని రెండుహాళ్లలో నెలలో కొన్ని రోజులు మినహా మిగతా రోజుల్లో మళయాళ డబ్బింగ్ చిత్రాలు నడుస్తున్నాయి. వీటి పోస్టర్లు ఏ విధంగా వుండేది చెప్పనక్కర్లేదు. వీటికి తోడు పెద్ద హీరోలు నటించిన సినిమాల్లో హీరోయిన్లు అంగాంగ సౌందర్యం బట్టబయలయ్యేలా పెద్ద పెద్ద పోస్టర్లు నగరంలో దర్శనమిస్తున్నాయి. ఈమధ్య విడుదలైన తులసి, మైసమ్మ, గొడవ చిత్రాల పోస్టర్లలో హీరోయిన్ల దేహ ప్రదర్శననే ఆధారంగా పోస్టర్లు ప్రతి వీధిలో దర్శనమిస్తున్నాయి. కాలేజీలు, పాఠశాల ప్రాంతాల్లో ఈ పోస్టర్లు చూస్తూ దారిన వెళ్లే విద్యార్థినులు, మహిళలను పోకిరీలు రకరకాల కామెంట్స్‌తో ఇబ్బంది పెడుతున్నాయి. ఈ టీజింగ్ భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థినుల కేసులు నగరంలో వున్నాయి. టీవీలు, ఇంటర్నెట్ అశ్లీలాల ముందు సినిమా పోస్టర్లు పెద్ద అశ్లీలం కాదని ఈ వ్యవహారంపై అందరూ వుదాసీనవైఖరి ప్రదర్శిస్తున్నట్లుంది. ఇలా అయితే ఎలా?



మళయాళం కాదు తెలుగు సినిమా పోస్టరే!


ప్రధమ వర్ధంతి

ఎందరికో చేయూతగా నిలిచి
వారి కుటుంబాలలో వెలుగులు నింపిన మార్గదర్శి

శ్రీ జక్కా రాధాకృష్ణారెడ్డి గారి
(రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్, APSRTC, Hyderabad.)
ప్రధమ వర్ధంతి సందర్భంగా వారిని స్మరించుకొంటూ...



శ్రీ జక్కా రాధాకృష్ణారెడ్డి గారు
జననం : 10-7-1939 మరణం : 16-12-2006

తల్లి : జక్కా కామేశ్వరమ్మ

సోదరులు
జక్కా కోదండరామిరెడ్డి - సులోచనమ్మ
జక్కా శ్రీనివాసులురెడ్డి - సౌదామిని
జక్కా శివనారాయణ రెడ్డి - లక్ష్మిప్రసన్న

కుమార్తెలు - అల్లుళ్లు
కల్పన - ఏనుగ మురళీమోహన్ రెడ్డి
అనురాధ - కారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

మనుమలు - మనుమరాండ్రు
ఏనుగ రోహన్‌రెడ్డి , ఏనుగ పూజిత, కారంపూడి రవితేజ, కారంపూడి సుజాత

# కళానైపుణ్యానికి కాణాచి లేపాక్షి!





దేశవ్యాప్తంగా ఎంతో మంది కళాకారులు, చేతివృత్తుల కళాకారులు తమ కళా నైపుణ్యాన్ని దశదిశలా తెలియజెప్పేందుకు లేపాక్షి హస్తకళల ప్రదర్శన ఎంతో దోహదపడుతుందని చెప్పవచ్చు. ఒక రకంగా కళలకు కాణాచి లేపాక్షి అన్నా అతిశయోక్తి లేదు. అటు కళాత్మకతకు, ఇటు ప్రతిభకు గీటురాయిగా వుండే పలు ప్రాంతాల కళాకారులు తయారుచేసిన వస్తువులకు లేపాక్షి ఒక వేదికగా వుంటోంది. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేపాక్షి బొమ్మల కొలువు నెల్లూరు ఇందిరా భవన్‌లో కొలువు తీరింది. ఈనెల 6వ తేదీన ప్రారంభమైన చేనేత, హస్తకళల అమ్మకాల ప్రదర్శన ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగుతుంది. నగిషీలు చెక్కిన కళాఖండాలు, ఆట బొమ్మలు, అత్యంత అద్భుతంగా కళాకారుల కుంచె నుండి జాలువారిన చిత్రాలు, కొయ్య వస్తువులు పలురకాలు ఇక్కడ దర్శనమిస్తున్నాయి. ఎంతో రమణీయంగా వుండే కొండపల్లి బొమ్మలు, ఎంతసేపు చూసినా ఇంకా ఇంకా చూడాలనిపించేలా వుండే రాజస్థాన్ పెయింటింగ్స్ లేపాక్షి హస్తకళా ప్రదర్శనలో విశేషంగా ఆకట్టుకొంటున్నాయి. కళాకారుల కళా నైపుణ్యానికి గీటురాయిగా చెప్పుకునేలా వుండే ఏటికొప్పాక బొమ్మలు ఎన్నో రకాలు, గిలక బొమ్మల నుండి దేవుని బొమ్మలు, కీ చైన్లు, ల్యాంప్ డోములు సమస్తం దొరుకుతున్నాయి. ముఖ్యంగా వెజిటబుల్ పెయింట్స్ చేసిన బొమ్మలు నాలుగు వందల రూపాయల ధర పలుకుతున్నాయి. ఒరిస్సా చేనేతలు తయారుచేసిన వాల్ హ్యాంగింగ్స్, జనపనార బొమ్మలు, రాజస్థాన్ హ్యాండ్ పెయింటింగ్ చిత్రాలు ఆయా కళాకారుల నైపుణ్యానికి అద్దం పడుతున్నాయి. కలకత్తా చేనేత వస్త్రాలు, బెంగాలీ కాటన్ చీరలు, జైపూర్ హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ చీరలు, బెడ్‌షీట్లు, రాజ్‌కోట్ పటోలా, ప్యూర్ శిల్క్ శారీస్, కర్టెన్లు వేటికవే భిన్నంగా ఆకర్షణీయంగా వున్నాయి. ప్యూర్ లెదర్ బ్యాగులు, బెల్టులు, మైసూర్ శాండల్ అగర్‌బత్తీలు, సెంట్, షెహరాన్ ప్యూర్ కొయ్య వస్తువులు, బ్లాక్ మెటల్, వెండి, ముత్యం ఆభరణాలు రమణీయంగా మహిళల మనసు దోచుకొనేలా వున్నాయి. టెర్రకోట పూలకుండీలు, రోజ్‌వుడ్ ఐటమ్స్, బంజారా డ్రస్సులు, విలువైన స్ఫటిక, రుద్రాక్ష, మాలలు, పీచుతో చేసిన కర్టెన్లు, సిరామిక్ ఐటమ్స్, ఇత్తడి వస్తువులు సమాహారంగా లేపాక్షి ఎగ్జిబిషన్ నెల్లూరీయులను విశేషంగా ఆకట్టుకొంటుంది.



# ఫ్రేముల్లో దాగిన అందాలెన్నో...



సృజనాత్మక శక్తి, వృత్తిలో నైపుణ్యం వుండాలే గానీ సాధారణంగా దొరికే వస్తువులనూ కొత్త తరహాలో, విభిన్నంగా తయారు చేయవచ్చు. పాత వస్తువులకే చిన్నపాటి మార్పులు చేసి కొత్త వస్తువుల్లా తీర్చిదిద్దడాన్ని చూస్తూ వుంటాం. ముఖ్యంగా ఇళ్లలో అలంకరణకు ఉపయోగించే వస్తువులు ఎప్పటికప్పుడు నూతనంగానూ, వినూత్నంగానూ వుండేలా తయారీదారులు జాగ్రత్తలు తీసుకొంటుంటారు. ఎన్నిరకాల వస్తువులు వచ్చినా, ఎంత ఖరీదైన గృహాలంకరణ వస్తువులు వినియోగిస్తున్నా, ఏ వస్తువుకు ఆ వస్తువు ఎప్పటికప్పుడే అన్న తరహాలో అందరూ వాడే వస్తువులే మార్కెట్‌లో దొరికేవే అయినా కొత్తమోడల్స్‌తో కళాత్మకత వుట్టిపడేలా వివిధ రకాల ఐటెమ్స్ వుంటున్నాయనే చెప్పవచ్చు. అందమైన ఇంటిని, మరింత అందంగా తీర్చిదిద్దుకొనేందుకు తమలోని కళాతృష్ణను ప్రతిబింబించేలా అనేక రకాల వస్తువులను ఇళ్లలో వాడుతుంటారు. ఖరీదైన పెయింట్స్ వేసిన గోడలకు మరింత వన్నెవచ్చేలా వున్నాయి వెదురు, పేమును ఉపయోగించి తయారు చేసిన ఫ్రేములు. మామూలుగా రకరకాల చిత్రాలు వుండే ఫ్రేములను, ఫోటోలు చట్రంలో అమర్చి ఫ్రేమ్‌గా చేసిన వాటిని గోడలకు తగిలించడం జరుగుతుంటుంది. చూసేందుకు దగ్గర దగ్గర ఒకేలా వున్నా తరచి చూస్తే ఈ ఫ్రేములలోని గొప్పతనం, అది చేసిన వారి నైపుణ్యం కొట్టొచ్చినట్లు కనపడుతుంది. వెదురుతో పేమును ఉపయోగించి పలు రకాల ఫర్నిచర్‌ను చేయడం, వాటిని వాడడం సర్వసాధారణం. అయితే ఈ కొత్త ఫ్రేముల్లో మాత్రం పేమును, వెదురును కలిపి వినూత్నంగా పూల కుండీలు, బుట్టలలాగా చేసి, వాటికి శొబగులు అద్ది హృద్యంగా తయారుచేసి వుంటున్నాయి. వీటికి అక్కడక్కడ గుడ్డతో సీతాకోకచిలుకలను చేసి వాటికి తళుకులను అద్ది ఒక ఫ్రేములాగా అమర్చి వుండడంతో చూపరులను విశేషంగా ఆకట్టుకొంటున్నాయి. మూడు వందల రూపాయల నుంచి వెయ్యి రూపాయలకు పైగా వుండే ఈ ఫ్రేములు మహతి ఫ్యాన్సీస్‌లో దొరుకుతాయి.





# నెల్లూరుకు క్రిస్మస్ కళ



ప్రపంచవ్యాప్తంగా వుండే క్రిస్టియన్లు, ఏసుక్రీస్తును ఆరాధించే వారు అత్యంత వేడుకగా జరుపుకునే పండుగ క్రిస్మస్. ఈ మాసంలో ప్రత్యేక ప్రార్థనలకు చర్చిలకు వెళ్లడం, క్రిస్మస్ కేకులను కట్ చేయడం, ఇళ్లను రంగురంగుల విద్యుత్ దీపాలు, డిజైన్ పేపర్లతో అందంగా అలంకరించు కోవడం చేస్తుంటారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పదిరోజులు ముందుగానే నెల్లూరులో పండుగ కళ వచ్చేసింది. గుడ్డల అంగళ్లు, బేకరీ నిర్వాహకులు క్రిస్మస్ పండుగను జరుపుకునే వారి కోసం ప్రత్యేక డిస్కౌంట్‌లు, కొత్తకొత్త వెరైటీలతో సిద్ధమవుతున్నారు. వీటితో పాటు క్రిస్మస్ పండుగకు అవసరమైన వస్తువులు, సరంజామాను రెడీచేసి వున్నారు వ్యాపారస్తులు. క్రిస్మస్ పండుగకు కళ తెచ్చే క్రిస్మస్ ట్రీ, స్టార్‌లు, అలకరించుకొనేందుకు విద్యుత్ దీపాలు అమ్మకానికి సిద్ధంగా వున్నాయి. క్రిస్మస్ పండుగకు క్రిస్మస్ ట్రీకి విడదీయరాని సంబంధం వుంది. ప్రతి ఒక్క క్రిస్టియన్ క్రిస్మస్ ట్రీ లేకుండా పండుగను జరుపరంటే అతిశయోక్తి కాదు. దీనిని దృష్టిలో వుంచుకొని వ్యాపారస్తులు పలురకాల క్రిస్మస్ ట్రీలను సిద్ధం చేసి వున్నారు. ప్లాస్టిక్, కాగితం ఉపయోగించి తయారుచేసిన క్రిస్మస్ ట్రీలు రెండు వందల రూపాయల నుంచి ఏడు వందల రూపాయల వరకు దొరుకుతున్నాయి. స్టార్‌లను క్రిస్టియన్లు ఇంటి ముందు పండుగకు కొద్ది రోజుల ముందు నుంచే తగిలిస్తుంటారు. పేపర్‌తో చేసిన రంగురంగుల డిజైన్లలో వుండే ఈ స్టార్స్‌లో లైటును పెట్టి వెలిగించినట్లయితే కాంతులీనుతూ వుంటాయి. ఈ స్టార్స్ 20రూపాయల నుంచి 150 రూపాయల వరకు వున్నాయి.



# ప్రియమణి మహో ముదురు!



పాతరోజుల్లో హీరోయిన్లు వందల సినిమాల్లో నటించినా చివరిరోజుల్లో చిల్లి చిండబ్బు లేక ఇబ్బందులు పడినవారే. ఇప్పటి హీరోయిన్లు మహా ముదుర్లు. దీపముండగానే ఇల్లు సర్దుకునే రకం. కొన్ని హవా నడుస్తున్న హీరోయిన్ ప్రియమణి గ్లామర్ ప్రదర్శనకు అభ్యంతరాలేవీ చెప్పడం లేదు. సినిమాల్లో కాదు కదా.... చిన్న చిన్న ప్రోగ్రాముల్లో కూడా కురచ దుస్తులతో స్టేజీపై కనపడి బాగా డబ్బులు సంపాదిస్తుంది. ఈ మొత్తాలను ఏం చేస్తున్నారంటే; నాన్న వ్యాపారంలో పెట్టుబడి పెడుతున్నానంది. ఈ విషయమై వివరిస్తూ బెంగుళూరులో మా నాన్నకు ఓ కంపెనీ వుంది. అందులో నేను, మా అన్నయ్య షేర్ హోల్డర్స్. నాన్న ఇండస్ట్రీని ఇంకా పెద్ద స్థాయికి తీసుకెళ్లాలి. పెద్ద బంగళా కట్టాలి. ఎక్కువ చిత్రాల్లో నటిస్తేనే కదా ఇవన్నీ ఒనగూడేది. ఇప్పటి సినిమాల్లో గ్లామర్.... ఎక్స్‌పోజింగ్ వంటివి తప్పవు. కాకపోతే నా హద్దులు నాకు తెలుసు. వాటిని దాటనులేండీ అంటోంది ఈ పొడుగు కాళ్ల సుందరి. టైమ్ వుంటే జిమ్‌కు వెళ్తానని, ఖాళీ సమయంలో అమ్మ ముఖానికి మీగడ రాస్తుందంది. దీని మూలంగా పార్లర్ల చుట్టూ తిరిగే పని తనకు తక్కువంది.

# ఆమెకిద్దరు..

కపూర్ల కుటుంబం నుంచి వచ్చిన హీరోయిన్ కరీనాకపూర్ వ్యవహారశైలి ఇటీవల ఆమెను వార్తల్లోని వ్యక్తిని చేసింది. ఇద్దరు ప్రియుల ముద్దుల చెచ్చెలిగా జనం ఆమెను వెటకారమాడుతున్నా పార్టీల్లో సైఫ్ అలీఖాన్, విదేశాల్లో షాహిద్‌కపూర్లతో చక్కర్లు కొడుతుంది. ఈ విషయమై మాట్లాడుతూ ఔను.... వాళ్ళిద్దరూ నా మిత్రులు. సైఫ్, షాహిద్‌లతో సన్నిహితంగా మెలగుతా. నేను పుట్టి బుద్ధెరిగినప్పట్నుంచీ ఎంతో మంది స్నేహితులున్నారు. కానీ ఈ మధ్య ఇద్దరు ప్రియుల బాలీవుడ్ ముద్దుగుమ్మ నంటున్నారు. నా ఇష్టం... నాకెందరుంటే మీకెందుకు అంటుంది. నా సినీ విశేషాలు వ్రాయండి. వైఫల్యాలు ఎత్తి చూపండి. తిరిగేది వ్యక్తిగత విషయం; దాన్ని గూర్చి వ్రాస్తే ఎలానని పత్రికల వారితో గొడవకు దిగుతుంది.. పబ్లిక్‌లోకి వచ్చాక అంతా టాంటాం చేస్తామన్న మహాకవి శ్రీశ్రీ పలుకులు ఈ సుందరాంగి చెవిన పడలేదేమో?





# పిచ్చి నమ్మకాల సుస్మిత...

మాజీ విశ్వ సుందరి సుస్మితాసేన్ ఇటీవల తన 32వ జన్మదినోత్సవ వేడుకలను బ్యాంకాక్‌లో ఘనంగా జరుపుకొంది. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రతి పదహారు సంవత్సరాలకు నా జీవితంలో చెప్పరాని అద్భుతాలు జరుగుతాయని సంఖ్యాశాస్త్రం చెబుతుంది. కాబట్టి, ఈ యేడాది నాకు బాగా కలిసి వస్తుందంటుంది. మగవారితో స్నేహం చేసే విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకొంటానంటుంది. ఒకరితో సంబంధం కొనసాగించే ముందు వారితో తనకు వచ్చే లాభనష్టాలను బేరీజువేసుకున్నాకే ముందడుగు వేస్తానంది. అంతే కానీ బట్టల్ని మార్చినంత తేలిగ్గా రోజుకో బాయ్‌ఫ్రెండ్‌ను మార్చే అలవాటు తనకు లేదంది.

దేశముదురు ఫేం హన్సికను తెలుగు ప్రేక్షకులు అంత సులభంగా మరువలేరు. ఈ చిత్రం తర్వాత హిందీ చిత్రాలకే పరిమితమైన ఈ ముద్దుగుమ్మ ఎన్టీఆర్ సరసన కంత్రీలో నటిస్తుంది. షూటింగ్‌గ్యాప్‌లో పిచ్చాపాటీగా మాట్లాడింది. హిందీలోనూ ఎక్కువ చిత్రాల్లో నటిస్తున్నట్లు లేదే అంటే; అవును కొంత పేరుండే సినిమాలనే ఒప్పుకొంటున్నాను. దేశముదురులో పదహారేళ్ల వయసులో సన్యాసినిగా నటించాను. మంచి పేరు తీసుకు వచ్చిందా చిత్రం. ఇతర రాష్ట్రాలలోనూ మంచి ఆదరణ లభించింది. ప్రస్తుతం సునీల్ కుమార్ సరసన కన్నడంలో బిందాస్‌లో నటిస్తున్నాను. ఆయా ప్రాంతాలలో ప్రాధాన్యమున్న హీరోలతోనే చేస్తున్నాను. బాలీవుడ్‌లోనూ ప్రాధాన్యమున్న కథలను చూసి సినిమా ఒప్పుకొంటున్నాను. అటువంటప్పుడు నా హవా ఏవిధంగా తగ్గుతుంది. ఇప్పుడు నాది చిన్న వయసు. బాలీవుడ్‌లో ఎదిగేందుకు కావాల్సినంత సమయముంది. షూటింగ్ స్పాట్‌లో అందరితో కలుపుగోలుగా వున్నా వయస్సును దృష్టిలో పెట్టుకొని నా హద్దుల్లో నేనుంటానంటుంది హన్సిక.

# హద్దులు దాటను!



# భన్సాలీ చేయిపడితే...

ఐటెంగర్ల్ రాఖీసావంత్ తన మనసులోని కోరికను బయట పెట్టింది. అదేమిటంటే సంజయ్‌లీలా భన్సాలీ సినిమాలో ఒక చిన్న పాత్రైనా చేయాలనేది ఆమె చిరకాల వాంఛ. ఈ విషయమై ఆమె మాట్లాడుతూ ఆయన చేతిలో చెత్త ఆర్టిస్టు కూడా వజ్రంలా వెలిగిపోతారు. మిగతా దర్శకుల వంద సినిమాలు ఒకెత్తు... భన్సాలీ ఒకే ఒక్క సినిమా ఒకెత్తు. అతడు తీసిన 'సావరియా' నన్ను కొత్త లోకాలకు తీసుకెళ్లింది అని భన్సాలీని తెగ పొగిడేస్తోంది. శ్రీదేవి, మాధురీదీక్షిత్, రాణీముఖర్జీలను అభిమానించే రాఖీసావంత్ ఈ దీపావళిని తన కొత్త బాయ్‌ఫ్రెండ్ అభిషేక్ ఫ్యామిలీతో కలిసి ఎంజాయ్ చేసింది. మరి పెళ్లెప్పుడు? అని ప్రశ్నిస్తే పెళ్లికి అప్పుడే ఏం తొందర. ముందు మేము మా కెరీర్‌లో స్థిరపడాలి కదా. మేమేం అజయ్‌దేవ్‌గన్ - కాజోల్, షారూఖ్ - గౌరీఖాన్ లాగా డబ్బున్న వాళ్లం కాదు కదా. అందుకే సంపాదించుకొని ఆ తర్వాతే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకొన్నామంది రాఖీ.



# సేవా నిరతికి ప్రతీక ఆవోపా!

సమాజ సేవకు, ఆపన్నులను ఆదుకొనేందుకు అనేక స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సేవా సంస్థలు వెలుస్తుంటాయి. అయితే వీటిలో కొన్ని నిరుపమాన సేవా నిరతికి నిలువుటద్దంలా వుంటాయి. అలాంటిదే ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో వెలసిన ఆవోపా. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) వైశ్య కులస్తులు ఏర్పరచుకొన్న సంస్థ అయినప్పటికీ సేవారంగంలో తనకంటూ ఒక ప్రత్యేకతను కలిగి గత ముప్పై సంవత్సరాలుగా ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటున్నది. మానవ సేవే మాధవ సేవ అనే దాన్ని నమ్మి నిబద్ధతతో నిస్వార్థంగా పనిచేస్తున్న సంస్థ ఆవోపా. నిరుపేదలను ఆదుకోవడంతో పాటు ఆరోగ్యమే మహాభాగ్యం అని నమ్మి సంస్థ స్థాపించిన నాటి నుంచి నేటివరకు ఉచితంగా వైద్య శిబిరాలను నిర్వహించడం ఆవోపా ప్రత్యేకత. 1976లో స్వర్గీయ బి.పాండురంగారావు, యలమందయ్య, హరనాథ్, సుబ్రహ్మణ్యం, పాండురంగయ్యలు దీనిని నెలకొల్పారు. ఆనాటి నుంచి ఇంతింతై, వటుడింతై అన్నట్లుగా నిర్విరామంగా ప్రజాసేవ చేస్తూ, ప్రతిభావంతులకు వెన్నుదన్నుగా నిలుస్తూ తనదైన శైలిలో పలు స్వచ్ఛంద సంస్థలకు ఆదర్శంగా నిలుస్తోంది ఆవోపా. ఆర్యవైశ్యులు స్థాపించి వారి ఆధ్వర్యంలో నడుస్తున్న సంస్థ అయినప్పటికీ కుల, మతాలతో సంబంధం లేకుండా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేయడం ఆవోపా నిస్వార్థసేవకు నిదర్శనంగా చెప్పుకోవాలి. స్టోన్‌హౌస్‌పేటలోని గల కెఎసి కళాశాలలో ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా వైద్య శిబిరం నిర్వహిస్తుంటుంది. ఈ వైద్య శిబిరం విజయవంతం కావడానికి వైశ్య కులానికి చెందిన డాక్టర్ల కృషి ఎంతో వుంది. ఎవరి కార్యక్రమాల్లో వారు బిజీగా వుంటున్నా వైద్య శిబిరాలకు మాత్రం హాజరవుతూ రోగులను పరీక్షించడంలో ఏ మాత్రం వెనుకంజవేయకుండా పలువురు డాక్టర్లు 1981వ సంవత్సరం నుంచి నిరంతరాయంగా వైద్య సేవలు అందించడం అభినందనీయం. పేద విద్యార్థులను ఆదుకొనేందుకు, వారు విద్యను కొనసాగించేందుకుగానూ స్కాలర్‌షిప్పులు, ఆర్థికసహాయం ఆవోపా చేస్తున్న మరో ముఖ్యమైన కార్యక్రమం. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభా పాటవాలను వెలికితీసి వారి వెన్ను తట్టి ప్రోత్సహించేందుకు క్విజ్, వ్యాసరచన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఆవోపా సేవలు విస్తృత పరిచేందుకు, సేవా కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా వుండేందుకు పలు నిర్వహణ కమిటీలు వున్నాయి. ఫైనాన్స్, విద్యాకమిటీ, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఇలా పలు కమిటీలు వున్నాయి. వైశ్య కులానికి చెందిన వధూవరులకు వివాహాల కోసం వివాహ వేదికను ఈ సంస్థ నిర్వహిస్తోంది. ఆవోపా చేపట్టే కార్యక్రమాలు సభ్యులకు ఇతరులకు తెలియడం కోసం 1998 నుంచి ఆవోపా సంగతులు పేరుతో ఒక పత్రికను నడుపుతున్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా విభాగను ఏర్పాటు చేసి వున్నారు. ఆవోపాకు ప్రస్తుతం అధ్యక్ష, కార్యదర్శులుగా కె.కోటేశ్వరరావు, బి.కోటేశ్వరరావులు, మహిళా విభాగానికి రమాదేవి, సుభాషిణిలు అధ్యక్ష, కార్యదర్శులుగా వ్యవహరిస్తున్నారు.



ఆవోపా రజతోత్సవ సంబరంలో ఆర్థిక మంత్రి రోశయ్యను సన్మానిస్తున్న సంస్థ నిర్వాహకులు.



నెల్లూరు కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సాంస్కృతిక ప్రదర్శనిచ్చిన ఆర్య వైశ్య యువతిని సన్మానిస్తున్న ఆవోపా సభ్యులు.

# నృత్య గానాలలో మేటి అఖిల!

మధురమైన స్వరం దేవుడిచ్చిన వరమని అంటుంటారు పెద్దలు. తేనెలొలికే గాత్రంతో పాటలు పాడే అవకాశం అందరికీ రాదు. ఆ నటరాజు కృపా కటాక్షాలు లేనిదే నృత్యం అబ్బదు. మధురమైన గాత్రాన్ని, చక్కని నృత్యాన్ని రెండింటినీ తన వశం చేసుకొని అటు గాయనిగా, ఇటు నృత్య కళాకారిణిగా తనదైన శైలిలో రాణిస్తూ పలువురి చేత శభాష్ అనిపించుకొంటున్నది అఖిల. నెల్లూరులో పేరొందిన చెవి, ముక్కు గొంతు వైద్య నిపుణులు డాక్టర్ ఎ.వెంకటరమణారెడ్డి, భవానీల కుమార్తె అయిన అఖిల, నెల్లూరు చైతన్య ఐఐటి అకాడమీలో ఎనిమిదవ తరగతి చదువుతున్నది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం వుంటే సాధించలేనిది ఏమీలేదని నిరూపించేందుకు అఖిల ఒక ఉదాహరణ. చిన్న వయసులోనే అఖిలలో దాగివున్న ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు ఆ చిన్నారిని అన్ని విధాల వెన్నుతట్టి ప్రోత్సహించడంతోపాటు గురువుల వద్ద తగిన శిక్షణ ఇప్పించడం జరిగింది. నృత్య, గానాల పట్ల తనకున్న ఆసక్తి, తర్ఫీదుతో అఖిల రాష్ట్రస్థాయిలో తన ప్రతిభాపాటవాలను ప్రదర్శించి జిల్లా కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేసింది. టివిలు, సినిమాల్లో వస్తున్న డాన్సులను చూసి బుడిబుడి నడకల ప్రాయంలోనే బ్రేక్ డ్యాన్సులను సినీ హీరో, హీరోయిన్లను అనుకరిస్తూ చేసి చూపించేది. నారాయణమూర్తి, వెంకటేశ్వరరావుల వద్ద ఫోక్ డాన్సు, క్లాసికల్ డాన్సులలో ఓనమాలు దిద్దుకొని అనతికాలంలోనే వయసు చిన్నదైనా డాన్సులో పలువురితో పోటీ పడి ఏ సంస్థ నిర్వహించిన కార్యక్రమమైనా, ఎక్కడ నృత్య పోటీలు జరిగినా ప్రథమ స్థానాన్ని సాధించడం అఖిలలోని నృత్య అభినయానికి నిదర్శనం. కళాంజలి, కేతా అంకుల్ మెమోరియల్ వారు నిర్వహించిన డాన్సు పోటీలలోను, మద్రాస్‌లో ఆంధ్ర మహాసభ ఏర్పాటు చేసిన కార్యక్రమంలోను తన ప్రతిభను దాటి చెప్పింది. నృత్యంతో పాటు సంగీతంపై వున్న మక్కువతో సంగీతంలోనూ వసంత, సెవన్‌లెటర్స్ సుధాకర్, టివి సురేష్‌రావుల వద్ద గాత్రంలో శిక్షణ తీసుకొంటూ రెండు వందలకు పైగా ప్రదర్శనలు ఇచ్చి తన కోకిలగానంతో ఆహూతులను ఓలలాడిస్తున్నది. సంగీతంలో ఎం.ఎస్.సుబ్బలక్ష్మి, ఘంటసాల గానాన్ని, ఇళయరాజ సంగీతాన్ని ఎంతో ఇష్టపడే అఖిల తనకు అన్ని పాటల్లోను మెలోడి అంటే ప్రాణమంది. అఖిల చిత్రలేఖనంలోనూ పట్టు సాధించింది. జిల్లా స్థాయిలో జరిగిన పలు చిత్రలేఖనం పోటీల్లో బహుమతులను పొందింది. చదువులోనూ ముందుండే అఖిల బిలియర్డ్స్, క్యారమ్స్, బాస్కెట్‌బాల్ పోటీలలోనూ రాణిస్తుండడం అఖిలలో దాగివున్న ప్రతిభకు నిదర్శనం అనే చెప్పాలి. తల్లిదండ్రులతోపాటు, స్కూలు కరస్పాండెంట్ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ బాలాజీలు తనను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారని చెప్పే అఖిల భవిష్యత్తులో గానంలోనూ, డాన్సులోనూ జిల్లా గర్వించదగ్గ కళాకారిణి కావాలని ఆశిద్దాం.





హైదరాబాద్‌లోని కళాంజలి సంస్థ సన్మానాన్ని సినీ నటులు రాజశేఖర్, జీవిత చేతుల మీదుగా అందుకొంటున్న అఖిల.



Registered : RN 1156 / 57
No. PLG / NL / 9 - 8 / 06


# మనమంతా మెగా ఫూల్సా?

చిరంజీవి రాజకీయ ప్రవేశ రభస కొద్దిగా సద్దుమణిగింది. ఆ పాల పొంగుపై స్వయంగా ఆయనే నీళ్ల చిలకరించాడు. "నేను ఏదో ఒక నిర్ణయం తీసుకునే వరకు నోరు మూసుకుని వుండమని" గద్దిస్తూ ప్రకటన చేయడంతో అభిమానులంతా కుక్కిన పేనుల్లై పోయారు. వారం రోజుల పాటు ఆకాశం దద్దరిల్లేలా అల్లరి చేసిన వారు నిశ్శబ్దంగా వుండి పోతున్నారు. ఇంతకూ చిరంజీవి నిర్ణయం ఏమిటి, ఆ సినిమా ఎప్పుడు విడుదల కానున్నదన్న ప్రశ్నలకు బదులు దొరకడం చాలా కష్టం. ఆయనసలు రాజకీయా



లలోకి వస్తాడా, వస్తే ఎప్పుడు వస్తాడు, ఏ రూపంలో వస్తాడు, ఎవరితో కలుస్తాడు, పార్టీకి ఎటువంటి స్వరూపం కల్పిస్తాడన్న చర్చతో రాజకీయ వాదుల బుర్రలు వేడెక్కిపోతున్నాయి. అన్ని పార్టీలలో, అన్ని స్థాయిల నేతలలో ఈ కలవరం బలంగా కన్పిస్తున్నది. కానీ చిరంజీవి మాత్రం పెదవి విప్పడం లేదు; ఒక్కరితో మాట్లాడడం లేదు. ఆయన్ను కలవాలని ఎంతో పెద్ద స్థాయిలో వున్న నేతలు, ఎమ్పీలు, ఎమ్మెల్యేలు ఎన్నో తంటాలు పడుతున్నా ఒక్కరికీ ఇంటర్వ్యూ ఇవ్వడం లేదు. కనీసం ఫోన్లో మాట్లాడడానికి కూడా ఇష్టపడడం లేదు. పత్రికల వారినైతే ఆమడ దూరంలో పెడుతున్నారు. తన ఇంటి ఛాయలకు కూడా రానివ్వడం లేదు.

రాజకీయాలలోకి రావాలనుకున్నా, వద్దు అనుకున్నా ఇంత మౌనం, ఇంత దూరం, ఇంత రహస్యం పాటించవలసిన అవసరం ఏమీ లేదు. రాజకీయాలనేవి సినిమా షూటింగులు కావు. ఒంటరిగా ఆలోచించి, ఒంటరిగా రంగంలోకి దూకడం వీలయ్యేవి కావు. రాజకీయాలలో రాణించాలంటే సమిష్టి కృషి కావాలి. పై నుంచి క్రింది దాకా వేలాది మందితో కల్సి పని చేయాలి. వారితో ఆలోచనలు పంచుకోవాలి. సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలలో స్పష్టమైన విధానాలు కావాలి. వాటిపై విస్తృతస్థాయి చర్చ జరగాలి.

### పొలిటిక్స్ రావాలనుకున్నా వద్దనుకున్నా రహస్యమెందుకు?

ప్రజల నాడి పసికట్టే, ప్రజల అవసరాలు గమనించే, ప్రజల కోరికలు తీర్చే మార్గాలు వెతికి, ప్రజలను ఆకట్టుకునే అంశాలు గుర్తించే చాకచక్యం కావాలి. చిరంజీవి విషయంలో ఆయనకు ఒకరు సలహాలు చెప్పే పరిస్థితి లేదు; ఒకరిని అడిగే సూచన ఆయనలో కన్పించడం లేదు. తన కుటుంబానికి మాత్రమే ఏ చర్చ అయినా పరిమితం చేస్తున్నాడు.

రాజకీయాలలోకి రావాలా, వద్దా అన్నది ఆయన ఇష్టాఇష్టాల మీద ఆధారపడి వుంటుంది. రమ్మని ఎవరూ బలవంతం చేయలేరు; వస్తానంటే అడ్డు చెప్పగలిగిన వారూ లేరు. కానీ దాన్నొక డైమండ్ డబ్బా ఆట లాగా, పందాలు కట్టుకునే వినోదం లాగా మార్చి తమాషా చూడడం మాత్రం సమంజసం కాదు. చివరకు ఈ చర్చ చేసే మనలాంటి వారందరూ ఫూల్స్‌గా మిగిలిపోక తప్పదన్న సందేహం కల్గుతున్నది.

మీ విలువైన చిరునవ్వుకి... ఎనలేని రక్షణ
TRIDENT
MULTI SPECIALITY DENTAL HOSPITAL
16/569, Gandhi Nagar
(Beside Nellore Co-operative Urban Bank)
Pogathota, Nellore. A.P.
Ph : 2300188.
నూతన ప్రారంభోత్సవ ఆహ్వానం
10.30 a.m.
తేది: 20-12-2007 (గురువారం)
ప్రారంభకులు



శ్రీ ఆనం వివేకానందరెడ్డి గారు
M.L.A., Nellore.



శ్రీ ఆనం రామనారాయణరెడ్డి గారు
Honarable Minister
మొట్టమొదటిసారిగా స్పెషలిస్టు డాక్టర్లచే
నెల్లూరు ప్రజలకు అందుబాటులో అధునాతన పరికరాలతో...
మెరుగైన దంత వైద్యం అందించాలన్న దృఢసంకల్పంతో...
Dr. V.H. Chalapathi Kumar M.D.S.,
Prosthodontist & Implantologist
Dr. Suneel Kumar Chinni M.D.S.,
Cosmetic dentist & Endodontist
Dr. Sreenivas Nagarakanti M.D.S.,
Periodontist & Implantologist
Dr. Deepthi A. B.D.S.,
Dr. Sathyavani G. B.D.S.,
గమనిక
ట్రైడెంట్ డెంటల్ లైఫ్‌కార్డు సదుపాయం కలదు
MOTIF MEDIA 9885503254
అందరికీ ఆహ్వానం పలుకుతోంది ట్రైడెంట్ మల్టీ స్పెషాలిటి డెంటల్ హాస్పిటల్

భవనం అమ్మబడును
నెల్లూరులో శివప్రియ హోటలుకు ఫండ్ ఆఫీసుకు మధ్య యద్దనవారివీధిలో ఐదు పోర్షన్లకు వీలయ్యే 3 అంతస్తుల భవనం నెలకు రూ. 15 వేలు బాడుగ వచ్చేది వెంటనే అమ్మబడును.
-సంప్రదించండి-
సెల్: 9866185244, 9391634466

సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్
నెల్లూరు. ఫోన్: 0861
64555555, 9949555444

పెళ్ళి పట్టుచీరల అతిపెద్ద మెగాషోరూం



ఫ్యాన్సీ వర్క్ శారీస్,
సూపర్‌నెట్ ప్రింటెడ్ & ప్లెయిన్ శారీస్
బనారస్ శారీస్, బనారస్ వర్క్‌శారీస్
అన్ని రకాల పట్టుచీరలకు అతిపెద్ద మెగాషోరూం
సత్యభామ శిల్క్స్ A/C
టౌన్‌హాల్ ఎదురుగా, ట్రంకురోడ్, నెల్లూరు. ఫోన్: 2345656



ఏ దేశమేగినా ఎంతెత్తు కెదిగినా
జన్మభూమిని, 'జమీన్‌రైతు'ను
మరవక పోవడం
నెల్లూరీయుల సాంప్రదాయం
పాఠకులకు ప్రత్యేక కానుక
డెబ్బయ్ తొమ్మిదేళ్లుగా 'జమీన్‌రైతు'ను తమ అభిమాన పత్రికగా ఆదరిస్తున్న పాఠకులకు ఈ కొత్త సంవత్సరంలో కొంగ్రొత్త కానుకగా "సమయ్" అలారం టైమ్ పీస్ అందిస్తున్నాము.
1-12-2007 నుండి 31-3-2008 మధ్య
సంవత్సర చందా చెల్లించిన వారందరికీ ఈ కానుక అందుతుంది!
సంవత్సర చందా రూ.200
చందా చెల్లించిన వెంటనే రశీదుతో పాటు కానుక అడిగి తీసుకోండి. ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి. (చెక్కులు స్వీకరించబడవు) ద్వారా చందా పంపేవారు స్కీమ్ కాలపరిమితి ముగిసేలోగా మా కార్యాలయానికి వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.
జమీన్‌రైతు
వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పొగతోట, నెల్లూరు - 524 001. ఫోన్: 0861-2327354
సాహసోపేత వార్తా చిత్రిక - జమీన్‌రైతు వారపత్రిక

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.